# వక్ఫ్ చట్ట సవరణ
# మైనారిటీలపై దాడి




రచన

**హన్నన్ మొల్లా**

PSBH ప్రజాశక్తి బుక్‌హౌస్

రచన : **హన్నన్ మొల్లా**

స్వేచ్ఛానుసరణ : **ఎం. వి. ఎస్. శర్మ**

**ప్రచురణ సంఖ్య** : 1863

**ప్రథమ ముద్రణ** : జూన్, 2025

**ప్రతులు** : 2000

వెల : ₹ 5.00

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ

గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు

***website : www.psbh.in***

prajasaktipublishinghouse@gmail.com

**ముద్రణ**

ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై.లి. విజయవాడ

166984

# ముందుమాట

**వక్ఫ్** సవరణ చట్టం ఏ విధంగా ముస్లిం మైనార్టీ ప్రజలపై దాడి చేస్తున్నదో వివరిస్తూ మాజీ పార్లమెంటు సభ్యులు హన్నన్ మొల్లా ఒక కరపత్రాన్ని వ్రాశారు. హన్నన్ మొల్లాగారికి సుదీర్ఘకాల రాజకీయ అనుభవమున్నది. అనేక దఫాలుగా పార్లమెంటు సభ్యుడుగా పనిచేసిన విశేష అనుభవమున్నది. ప్రస్తుతం ఆయన రైతుసంఘం జాతీయనాయకుడుగా వున్నారు. దేశవ్యాపితంగా ముస్లిం మైనార్టీ ప్రజలు ఎంతో ఆందోళనకు గురవుతున్న వక్ఫ్‌సవరణ చట్టంలోని అనేక మైనార్టీ వ్యతిరేక అంశాలను ఎత్తిచూపుతూ ఆయన వ్రాసిన ఈ కరపత్రం ఎంతోవిలువైన సమాచారాన్ని తెలుపుతున్నది. కరపత్రం చిన్నదే అయినా అందులో సారాంశం చాలా విలువైనది. దీన్ని అందరు విస్తారంగా ప్రజల్లోకి తీసుకుపోవడం అవసరం. ఈ సందర్భంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని బలవంతంగా అమలు చేయడం కోసం భారతీయజనతాపార్టీ నాయకత్వం అబద్దాలతో కూడిన ప్రచార కార్యక్రమాన్ని దేశవ్యాపితంగా నిర్వహిస్తున్నది. సాధారణ ప్రజలకు రోజువారి జీవితంలో అంతగా సంబంధం లేని వక్ఫ్‌కు సంబంధించిన ఆంశాలను వక్రీకరించి అబద్దాలు జోడించి గతంలో వున్న వక్ఫ్ చట్టాన్ని ఆసరా చేసుకొని సాధారణ ప్రజల ఆస్తులను ముస్లింలు లాక్కుంటున్నారని ఇతర మతాలకు చెందిన పేద ప్రజలు దీని వల్ల అత్యధికంగా నష్టపోతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. అందుకే సంక్షిప్తంగానైనా వాస్తవాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి ఈ కరపత్రం ఎంతైన ఉపయోగపడుతుంది.

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ముస్లిం ప్రజానీకంతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా వారి అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా వక్ఫ్ చట్టాన్ని సమూలంగా సవరణ చేస్తూ కొత్త చట్టం చేసింది. ఈ సవరణ చట్టం యొక్క రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టులో ప్రస్తుతం విచారణ జరుగుతున్నది. పార్లమెంట్‌లో క్షుణ్ణంగా చర్చించి ఈ చట్టం చేసినందున దాని అమలులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదనే వాదనతో సుప్రీంకోర్టుపై కూడా సంఘ్ పరివార్ శక్తులు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాయి. ఈ ఒత్తిడిని ఎంతవరకు సుప్రీంకోర్టు ఎదుర్కోగలుగుతుందో రాబోయే కాలంలో చూస్తాము.

వక్ఫ్ అనగా తాము అత్యధికంగా విశ్వసించే "అల్లా" పేరిట తమ సంపదలో కొంత భాగాన్ని గాని లేదా మొత్తం సంపదను గాని తము కోరుకున్న ధార్మిక లేదా సామాజిక ప్రయోజనాల కొరకు వినియోగించాలని కోరుతూ (మన్‌షా-ఎ-వక్ఫ్) వక్ఫ్‌బోర్డు పరం చేయడాన్ని వక్ఫ్ చేయడం అంటారు. మసీదులు, దర్గాలు, ఖాన్‌ఖాలు, పీర్ల చావిడీలు, మదర్సాలు లేదా అనాథాశ్రమాలు లేక మరో సామాజిక ప్రయోజనం నిర్వహణ కొరకు వక్ఫ్ చేయడం ఇస్లామిక్ సాంప్రదాయాల్లో భాగంగా అనాదిగా ఉంటున్నది. దీన్ని బ్రిటిష్ ప్రభుత్వం మరియు ప్రీవీ కౌన్సిల్ కూడా ఆకాలంలోనే చర్చించి ఆమోదించాయి. వక్ఫ్ ఆస్తులు వక్ఫ్ బోర్డుపేరిట ఉండవు. విడివిడి వక్ఫ్ సంస్థలకు ఈ భూములు అంకితం చేయబడతాయి. వీటి యజమాని 'అల్లా' అనేది ముస్లింల విశ్వాసం. ఈ విడివిడి వక్ఫ్ సంస్థలోని భూములను పర్యవేక్షించాల్సిన బాధ్యత వక్ఫ్ బోర్డుది. సాధారణంగా ప్రతిరాష్ట్రానికి ఒక వక్ఫ్‌బోర్డు వుంటుంది. ఈ బోర్డులలో అత్యధికంగా సభ్యులను ప్రారంభం నుంచే రాష్ట్రప్రభుత్వాలే నియమిస్తున్నాయి. అయితే వక్ఫ్‌బోర్డులలో ముస్లిం ప్రజల నుండే సభ్యులుగా నియమించాలని ప్రారంభంనుండి చట్టం చెబుతున్నది. ఇస్లామిక్ సాంప్రదాయాలు ఇమిడి ఉన్నందున వక్ఫ్‌సంస్థలు లేదా వక్ఫ్‌బోర్డులను ముస్లిం మైనార్టీల సంస్థలుగా సమాజం గుర్తిస్తున్నది.

తమ ఆస్తులను వివిధ ధార్మిక లేదా సామాజిక కార్యక్రమాలకు దానంగా ఇచ్చే విధానం కేవలం ఇస్లామిక్ సాంప్రదాయంలోనే కాక ఇతర మత విశ్వాసాలు గల ప్రజల్లో కూడా ఆదినుండి అమల్లో వుంది. హిందూ మత విశ్వాసాలతో వున్న అనేక మంది తమ ఆస్తులను వివిధ దేవాలయాలకు లేదా ఇతర సంస్థలపేరిట రిజిస్ట్రేషన్ చేస్తూ ఆస్తులు వ్రాయడం మన అనుభవంలోనే అనేక ఉదాహరణలు వున్నాయి. తిరుపతి తిరుమల దేవస్థానం వెళ్ళేభక్తులు కోట్లరూపాయలు అక్కడ హుండీలో వేస్తారు. ఇవికాక ప్రజలు ఇచ్చిన సుమారు 40వేల ఎకరాల భూములు అనేక నివాస గృహాలు టిటిడి పేరుతో దేశవ్యాపితంగా ఉన్నాయి. దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల్లో హిందూ దేవాలయాలకు ఎండోమెంట్లుగా ఇచ్చిన ఆస్తులు 10 లక్షల ఎకరాలకు పైగా ఉన్నవి. మన రాష్ట్రంలోని సింహాచలం దేవస్థానం పేరిట విజయనగర రాజులు వేలాది ఎకరాల భూములు అంకితం చేశారు. అలాగే దేశంలోని ప్రతి ప్రధాన ఆలయానికి ప్రజలు బహుకరించిన వేల ఎకరాల భూములు వుండడం అతిసాధారణమైన విషయం.

ఇదే పద్ధతిని క్రైస్తవ మత సంస్థలలో కూడా మనం చూడవచ్చు. క్యాథలిక్ చర్చీలకు లక్షల ఎకరాల భూములు వున్నాయి. అందులో విద్యాలయాలు, అనాధ ఆశ్రమాలు, వైద్యాలయాలు మరియు హాస్టళ్ళు లాంటి ప్రజాప్రయోజనాలు నిర్వహించబడుతున్నాయి. సిక్కు మతంలో కూడా గురుద్వారాలకు భక్తులు ఇచ్చిన కోట్ల రూపాయల నిధులు బ్యాంకుల్లో ఉన్నాయి. ఈ నిధుల నుండి గురుద్వారాలు అనేక ప్రజాప్రయోజక కార్యక్రమాలకు ఖర్చుపెడుతుండటం మనం చూస్తున్నాం.

అనగా సంపన్న వర్గాలు తమ మత విశ్వాసాలకు అనుగుణంగా, తాము విశ్వసిస్తున్న ధార్మిక కార్యక్రమాలకు సామాజిక ప్రయోజనాలకు తమ సంపదను అంకితం చేయడం అన్ని మతాలలోను ఒక సాంప్రదాయంగా మన దేశంలో ఆది నుండి కొనసాగుతున్నది. ముస్లింలు కూడా దేవుని పేరిట ధార్మిక ఇతర సామాజిక కార్యకలాపాలకు తమ సంపదను అంకితం చేయడం (వక్ఫ్ చేయడం) కూడా ఇలాంటి విశ్వాసమే. ఇది ఇస్లామిక్ సాంప్రదాయాలలో భాగంగానే ముస్లిం ప్రజలు విశ్వసిస్తారు. అయితే ప్రస్తుత బిజేపి ప్రభుత్వం ఇతర మతాలకు చెందిన ఆస్తుల జోలికి పోకుండా కేవలం వక్ఫ్ ఆస్తులపై దుష్ప్రచారం చేయడం వాటి విధ్వంసానికి ప్రయత్నించడం, వీటిని ప్రభుత్వ ఆస్తులుగా ప్రకటించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడం వెనకాల సంఘ్ పరివార్ శక్తుల హిందుత్వ ఎజెండా పనిచేస్తున్నది. ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా దిగజార్చి వారి ధార్మిక స్థలాల ఆక్రమణ, ఆస్తుల విధ్వంసం ద్వారా వారి అస్తిత్వాన్ని అణిచివేసే కుట్రలో భాగంగానే సంఘ్ పరివార్ ప్రభుత్వం వక్ఫ్‌చట్టంలో సవరణలు చేస్తున్నది.

ఏ మతానికి సంబంధించినవైన, ఏ సాంప్రదాయంలోనైన ఇలాంటి ఆస్తులను ఆ మతసంబంధిత ప్రజలలో గుర్తింపు, విశ్వాసం కల్గి వున్న, ఆ మతానికి సంబంధించిన పెద్దలే నిర్వహిస్తుంటారు. హిందూ దేవాలయాలకు ట్రస్టుబోర్డులో హిందువులనే నియమిస్తారు. చర్చీల లేదా ఆ సంబంధిత ఆస్తుల నిర్వహణ క్రైస్తవ పెద్దల చేతిలో వుంటుంది. గురుద్వారాలు సిక్కులే నిర్వహించుకుంటారు. బౌద్ధులు, జైనులు తమ ఆస్తులను లేదా తమ సంస్థలను వారే నిర్వహించుకుంటారు. అయితే కేంద్రబిజేపి ప్రభుత్వం ప్రస్తుతం సవరించిన చట్టంలో ముస్లిం సంస్థల లేదా వక్ఫ్‌బోర్డు నిర్వహణకు నియమించబోయే బోర్డులలో అత్యధికులు ముస్లిమేతరులు వుండేలా ఏర్పాటుచేశారు. అనగా వక్ఫ్‌ఆస్తుల నిర్వహణ ముస్లింల చేతులనుండి బలవంతంగా లాక్కోడానికి చట్టరూపంలో దాడిచేయడమే లక్ష్యంగా ఈ వక్ఫ్ సవరణ చట్టం

రూపొందించబడింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 25,26 మరియు 30లలో మైనార్టీలకు ఇచ్చిన హామీలకు భిన్నంగా ఈ చట్టం చేయబడింది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలో వచ్చిన బిజేపి ప్రభుత్వం ఆ రాజ్యాంగానికి తూట్లు పొడవడం వక్ఫ్సవరణ చట్టంలో మనం చూస్తాం. ఇస్లామ్ మతంపై తీవ్రమైన వ్యతిరేకత, ముస్లిం ప్రజలు ఈ దేశంలో హిందు ప్రజలకు లోబడి వుండాలనే శత్రుభావనతో బిజేపి ముస్లిం ప్రజలపై ఈ రకమైన దాడులు చేస్తుండటం అనేక సందర్భాలలో మనం చూస్తున్నాం. ఇప్పుడు వక్ఫ్ ఆస్తులపై చట్టాన్ని ఏకపక్షంగా సవరించడం కూడా తమ ఆధిపత్య అజెండాలో భాగమే.

గతంలో వున్న వక్ఫ్చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ ముస్లిం ప్రజలు కుట్రపూరితంగా తమకు యాజమాన్య హక్కులు లేకున్నా ముస్లిమేతరుల భూములను గుట్టుచప్పుడు కాకుండా వక్ఫ్భూములుగా చేసుకుంటున్నారని బిజెపి నాయకులు ఉద్దేశపూర్వకంగా ప్రజలలో ప్రచారం చేస్తున్నారు. దానికి ఉదాహరణగా తమిళనాడులోని ఒక గ్రామంలో ఎప్పుటినుండో వున్న దేవాలయాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా చూపుతున్నారని ఇంతకంటే ఘోరం ఇంకేముంటుందని దేశమంతా ప్రచారం చేస్తున్నారు. వక్ఫ్ ఆస్తుల్లో ఎక్కడైన ఒక దేవాలయం నిర్మించుకోవడం జరిగి వుండవచ్చు. అలాగే ఎక్కడైన హిందు ఎండోమెంట్ స్థలంలో మసీదు నిర్మాణం కూడా జరిగి వుండవచ్చు. వందల సంవత్సరాలుగా వక్ఫ్ఆస్తులు నిర్లక్ష్యానికి గురికావడం వల్ల వక్ఫ్స్థలాల్లో జనవాసాలు ఏర్పడి అక్కడి ప్రజల ధార్మిక విశ్వాసాలతో దేవాలయం కూడా నిర్మించి వుండవచ్చు. అయినంత మాత్రాన ఆ స్థలం యొక్క స్వభావం మారదు. అటువంటి ఇతర మతాల ఆలయాలు వుంటే రాష్ట్రప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకొని నష్టపరిహారం చెల్లించి పరిష్కరించవచ్చు. ఇలాంటి ఉదాహరణే మనరాష్ట్రంలోని విశాఖలో మనం చూడవచ్చు.

సింహాచలం దేవాలయ ఆస్తులు పరిశీలిస్తే విజయనగర రాజులు ఆ దేవాలయానికి వేలాది ఎకరాల భూములు ఇచ్చారు. అందులో విశాఖనగరానికి దగ్గరలో వున్న భూములన్ని నివాసస్థలాలుగా మారాయి. అనేక కాలనీలు ఈ స్థలాల్లో ఏర్పడ్డాయి. అందులో ఏదైన ఒక ప్రాంతంలో ముస్లిం ప్రజానీకం నివాసముంటూ ఒక మసీదును నిర్మించుకొని, ఈ మసీదు స్థలం దేవస్థానం వారు తమదని చెబుతున్నారు. ఇది అన్యాయం అని గగ్గోలు పెడితే అందులో న్యాయం వుంటుందా? దేవాలయాల స్థలాలనుగాని, మసీదుస్థలాలను గాని ప్రభుత్వం కాపాడాలి. అవసరమైతే ప్రభుత్వం

నష్టపరిహారం చెల్లించి ఆ స్థలాలను స్వాధీనం చేసుకొని మసీదు లేదా దేవాలయాలకు ఇవ్వడం సరైన చర్య అవుతుంది. అలాకాకుండా ప్రజలను ఒకరిపై మరొకరిని రెచ్చకొట్టడం మతోన్మాదులు మాత్రమే చేసేపని. ఇప్పుడు బిజెపి అదే చేస్తుంది.

సంఘ్ పరివార్ శక్తులు తమ అజెండకనుగుణంగా వక్ఫ్‌బైయూజర్ అనే అంశాన్ని వక్ఫ్‌చట్టం నుండి తొలగించారు. ఇది ఒక ప్రమాదకరమైన సవరణ. ఏదైన ఒక స్థలం, ముస్లిం ప్రజలు తమ మతవిశ్వాసాలకు వినియోగించుకుంటూ వుంటే అటువంటి స్థలాన్ని లేదా కట్టడాన్ని వక్ఫ్‌బైయూజర్ అని అంటారు. బ్రిటీష్ కాలం నుండి ఈ సాంప్రదాయం చట్టరూపంలో అమలు జరుగుతూ వున్నది. మసీదు, పీర్లచావిడి, దర్గా మరియు స్మశాన వాటికలు ఈ జాబితాలో వుంటాయి. అనేక వందల సంవత్సరాల నుండి వాడుకలో వున్న ఈ స్థలాలకు ఇది తమదిగా చెప్పే ఆధారాలను, పత్రాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించి ఈ ఆస్తి చట్టబద్ధతను నిరూపించుకోవాలని ప్రస్తుత చట్టసవరణ చెబుతున్నది. అలా పత్రాలను చూపకపోతే అది ప్రభుత్వ ఆస్తిగా ప్రకటింపబడుతుంది. అనగా వందల సంవత్సరాల క్రిందటి మసీదులకు ఇప్పుడు ఆధారాలు చూపాలి. అలా చూపలేక పోతే ఆ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఒక్క బాబ్రీమసీదు వివాదంలోనే దేశం అనేక సంవత్సరాలు మత వైషమ్యాలతో తల్లడిల్లింది. వక్ఫ్‌బైయూజర్ చట్టబద్ధంగా గుర్తించబడుతున్న కాలంలోనే కాశీలో మసీదు, సంభల్‌లో మసీదు, మధురలో ఈద్గాలు వివాదస్పదంగా మారాయి. ఈ మసీదుల కింద దేవాలయాలు వున్నాయని వివాదాలు రెచ్చగొట్టడానికి తద్వార హిందుత్వ భావనలతో మెజార్టీ ప్రజలను సంఘటితం చేసుకోవడానికి తమ ఓటు బ్యాంకు రాజకీయాలకు ఈ చట్టసవరణ వినియోగించుకోవాలనే దురుద్ధేశంతో బిజెపి వక్ఫ్‌బైయూజర్‌ను తొలగించింది.

వక్ఫ్‌ఆస్తులు గత 10సం॥లలో 10లక్షల ఎకరాలు పెరిగాయని, ప్రజలకు తెలియకుండానే ఇతరుల ఆస్తులను కబ్జాచేసే వుద్దేశంతో వక్ఫ్‌బోర్డులు ఏ ఆధారం లేకుండానే ఈ ఆస్తులను తమవిగా ప్రకటించుకుంటున్నారని ఎలాంటి ఆధారాలు లేని ఒక అబద్దపు ఆరోపణను బిజెపి నాయకత్వం పదే పదే చేస్తున్నది. పాత చట్టప్రకారం కూడా ఒక ఆస్తి వక్ఫ్ ఆస్తిగా నమోదు కావడం వెనుకాల చట్టబద్ద ప్రక్రియ ఒక సంవత్సరకాలం వుంటుంది. ఎవరైన తమ ఆస్తిని వక్ఫ్‌చేయాలనుకుంటే ఏ వుద్దేశంతో ఆస్తిని వక్ఫ్‌చేస్తున్నారో తెలుపుతూ తాము వక్ఫ్‌చేస్తున్న ఆస్తులు తమవేనని చెప్పే ఆధారాలను తెలుపుతు వక్ఫ్‌బోర్డుకు దరాఖాస్తు చేసుకోవాలి. ప్రాథమిక ఎంక్వైరిలో

దరఖాస్తుదారుడు చెప్పేవన్నీ నిజాలేనని తేలిన తరువాత ఆ ఆస్తిని ప్రభుత్వ గజెట్‌లో నోటిఫై చేయాలి. ఎవరైన అభ్యంతరాలు తెలుపుకోవడానికి ఒక సంవత్సరం సమయం వుంటుంది. అభ్యంతరాలను విచారించిన తరువాతనే వక్ఫ్‌బోర్డు నిర్ణయం తీసుకుంటుంది. వక్ఫ్‌బోర్డు నిర్ణయం తమకు అనుకూలంగా లేదని ఎవరైన భావిస్తే వారు వక్ఫ్‌ట్రిబ్యూనల్‌కు అప్పీల్ చేయవచ్చు. ట్రిబ్యూనల్లో రిటైర్డ్ జిల్లాజడ్జి స్థాయి అధికారి వుంటారు. విచారణ తరువాత ట్రిబ్యూనల్ నిర్ణయం ప్రకారంగా అమలవుతుంది. ఇంత దీర్ఘకాల ప్రక్రియ గత చట్టంలో వుంటే రాత్రికి రాత్రి హిందువుల ఆస్తులన్నీ వక్ఫ్‌బోర్డు దురాక్రమణకు గురవుతున్నాయని దేశాన్ని పాలించే పార్టీవారు ఈ అబద్ధాలు చెప్పడం వారి అజ్ఞానానికి లేదా వారి మతోన్మాద కుట్రలకు ఉదంతాలుగా మనం భావించవచ్చు.

బిజేపి ప్రభుత్వం చేసిన ప్రస్తుత సవరణలో వక్ఫ్ఆస్తుల వివాదాలు పరిష్కరించే అధికారాన్ని వక్ఫ్‌ట్రిబ్యూనల్ నుండి తొలగించి జిల్లా కలెక్టర్లకు ఇవ్వడం జరిగింది. అనగా రాజ్యాంగ స్ఫూర్తితో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనే న్యాయవ్యవస్థ నుండి ఈ అధికారాలను తొగించి అధికార యంత్రాంగంలో భాగమైనటువంటి జిల్లా కలెక్టర్లు లేదా జాయింట్ సెక్రెటరీలకు ఇవ్వడం వక్ఫ్ఆస్తులను విధ్వంసం చేసే దురాలోచన లేదా వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే కుటిల యత్నంగా భావించాలి. అలాగే ఎవరైన తమ ఆస్తులను ధార్మిక లేదా సామాజిక కార్యక్రమాలకు వక్ఫ్‌చేయాలనుకుంటే అటువంటివారిపై ప్రస్తుత చట్టసవరణల ద్వారా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. 5సంవత్సరాలకంటే ఎక్కువ సమయం ఇస్లాం పట్ల విశ్వాసం వున్నవారు మాత్రమే వక్ఫ్‌చేయాలని ప్రస్తుత చట్టంలో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించింది. అంటే ముస్లిమేతరులుగాని, కొత్తగా ఇస్లాంలో చేరినవారు గాని వక్ఫ్‌చేయడానికి ప్రస్తుత చట్టసవరణ అంగీకరించదు. ఎవరి విశ్వాసానికి ఎవరు సాక్ష్యంగా వుంటారో ప్రభుత్వం చెప్పలేదు. అనగా 5సంవత్సరాల నుంచి మత విశ్వాసంతోలేరని తమ విచారణలో తేలిందనే సాకుతో ముస్లిం సంస్థలకు దాతలు వక్ఫ్‌చేయడాన్ని ప్రభుత్వం తిరస్కరించేందుకు ముందే పునాది వేసుకుంటున్నది.

దేశంలోని సామాన్య ముస్లిం ప్రజల ప్రయోజనాల కోసమే వక్ఫ్‌చట్టాన్ని సవరిస్తున్నామని కేంద్రప్రభుత్వం మరియు బిజేపి నేతలు మోసపు మాటలు చెబుతున్నారు. ఏ ముస్లిం ప్రజలు వక్ఫ్‌చట్టాన్ని మార్చమని కోరుతున్నారో ఎవరికీ తెలియదు. బిజేపికి పార్లమెంటులో ఒక ముస్లిం సభ్యుడుకూడా లేడు. కేంద్రక్యాబినెట్లో

ముస్లిం సామాజిక తరగతి నుండి ఒకరు కూడా మంత్రివర్గంలో లేరు. అనేక రాష్ట్రాల్లో శాసన సభల ఎన్నికల్లో ఒక్కముస్లిం కూడ టికెట్టు ఇవ్వని చరిత్ర బిజేపిదే. ముస్లింల పట్ల విద్వేషంతో వారిని అణచివేయడానికి అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్న బిజేపి నాయకులు ముస్లిం ప్రజల ప్రయోజనాలను గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లే అర్థం చేసుకోవాలి. లౌజిహాద్ పేరుతో ముస్లిం యువకులపై దాడులు, గోరక్షక సంఘాల పేరుతో ముస్లిం పశువుల వ్యాపారులపై దాడిచేసి వారిని హతమార్చడం, ముస్లిం పర్సనల్ లాలో ఏకపక్షంగా తలపెట్టిన మార్పులు, ఎక్కడ చిన్న శాంతి భద్రతల సమస్య ఏర్పడినా అక్కడ ముస్లింలపై తీవ్రమైన నిర్బంధం నాన్‌బెయిలబుల్ లేదా యుఎపిఎ కేసులు వారి ఇండ్లపై బుల్డోజర్లను పంపి ధ్వంసం చేయడం  బిజేపి రాజ్యంలో నిత్యం మనం చూస్తున్నాం. ముస్లిం వ్యతిరేకతతో మెజార్టి ప్రజలను రెచ్చగొట్టి మతకల్లోలాకు బీజం వేసెందుకు బిజేపి లేదా సంఘ్‌పరివార్ శక్తులు ఈ చట్టాన్ని తెచ్చాయని సాధారణ ముస్లిం ప్రజలు భావిస్తున్నారు. ముస్లిం ప్రజలను అన్ని రంగాల్లో అణచివేసే ఉద్దేశం తప్ప వారి ప్రయోజనం కొరకు ఈ చట్టసవరణ చేయడం లేదని నిష్పాక్షికంగా ఆలోచించే ప్రతి ఒక్కరికి అర్థమవుతుంది.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ లేదా ముస్లిం ప్రజల సంక్షేమమే కేంద్రప్రభుత్వ అజెండా అయివుంటే ముస్లిం సమాజంతో సంప్రదింపులు చేసివుండేది. దేశవ్యాపితంగా లక్షలాది ఎకరాల విలువైన వక్ఫ్ఆస్తులు దురాక్రమణకు గురైనవి. వక్ఫ్‌బోర్డులకు ఈ ఆక్రమణలను తొలగించే అధికారం చట్టరీత్యలేదు. వీరు రెవెన్యూ మరియు పోలీస్ వ్యవస్థలపై ఆధారపడి ఆక్రమణలను తొలగించే ప్రయత్నం చేయాలి. ఆచరణలో ఇతర శాఖల సహకారం తగినంత వుండదు. రాజకీయ నాయకుల జోక్యం వుంటుంది. స్వార్థపరులైన బోర్డుసభ్యులు లేదా ముతవల్లీలు తమ స్వప్రయోజనాలకొరకు ఈ భూములను కాజేసెందుకు తోడ్పడుతున్నారు. ఎండోమెంట్ బోర్డులకు వుండె అధికారాలు వక్ఫ్‌బోర్డులకు ఇస్తే చాలా ఆస్తులు రికవరీ చేసేందుకు అవకాశాలు ఏర్పడుతాయి. అలాగే సిఈఒలుగా ఐఎయస్ ఆఫీసర్లను నియమిస్తే వక్ఫ్‌బోర్డుల నిర్వహణ బాగుపడుతుంది. వక్ఫ్ఆస్తులనుంచి వచ్చే ఆదాయంతో ముస్లిం ఒంటరి మహిళల సంక్షేమం, ఆ సామాజిక తరగతిలో వున్నత విద్యను అభివృద్ధి చేయడానికి ఎంతో అవకాశం ఏర్పడుతుంది. బిజేపి ప్రభుత్వం నుంచి ఇది ఆశించడం ఎండమావులనుండి దప్పిక తీర్చుకోవడంగానే వుంటుంది.

ఒకసారి వక్ఫ్‌చేబడ్డ ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్‌ఆస్తులుగానే వుంటాయని వాటి స్వాధీన అధికారం ఎవరికి లేదని సుప్రీంకోర్టు పదే పదే తన తీర్పులలో చెబుతున్నది. అందుకొరకే పార్లమెంటు చేసిన చట్టాన్ని ఆపే అధికారం సుప్రీం కోర్టుకు లేదని బిజేపి అల్లరిమూకలు దేశవ్యాపితంగా ప్రచారం చేస్తున్నాయి. అలాగే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 మరియు 30 లలో మైనార్టి ప్రజలకు ఇచ్చిన హక్కులకు బిజేపి ప్రస్తుతం వక్ఫ్ చట్టంలో చేసిన సవరణలు పూర్తిగా వ్యతిరేకంగా వున్నాయి. భారతరాజ్యాంగం మీద సెక్యులర్ విధానాల మీదా సంఘ్‌పరివార్ శక్తులకు ఎప్పుడూ నమ్మకంలేదు. అందుకోసమే రాజ్యాంగాన్ని మార్చడానికి బిజేపి అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ముస్లింలు ఇతర మైనార్టీలు 2వ తరగతి పౌరులుగా వుండాలని బిజేపి ప్రయత్నిస్తున్నది. సెక్యులర్ శక్తులు, సంఘాలు సమైక్యంగా ఉద్యమించి మన రాజ్యాంగాన్ని కాపాడుకోలేకపోతే రాబోయేకాలంలో మన రాజ్యాంగానికి, అందులోని మౌలికాంశాలకు తీవ్రప్రమాదం ఏర్పడే అవకాశం వున్నది. సెక్యులరిజం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఫెడరల్ రాజ్యాంగం మరియు న్యాయవ్యవస్థ స్వతంత్రత అన్నవి భారతరాజ్యాంగం యొక్క విశిష్టతలు. వీటిని కాపాడుకోవడంపైనే ప్రజల ఐక్యత, జాతీయసమైక్యత ఆధారపడి వుంటాయి. రాజ్యాంగం యొక్క మౌళిక విలువల పరిరక్షణ కోసం సమైక్యంగా ఉద్యమించడం దేశభక్తులందరి ముందున్న కర్తవ్యం.

దేశంలో అనేక పక్షాలు వక్ఫ్‌సవరణ చట్టాన్ని తిరస్కరించాయి. దేశంలో అనేక నగరాల్లో భారీర్యాలీలు, ప్రజాప్రదర్శనలు జరిగాయి. అయినా నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నచందంగా బిజేపి అన్ని విలువలు వదులుకొని తమ మతోన్మాద అజెండాతో ప్రజలమధ్య చిచ్చుపెడుతున్నారు. ఆంధ్రరాష్ట్రంలో అధికారం కోసం కుమ్ముకుంటున్న తెలుగుదేశం, వైసిపి పార్టీలు నరెంద్రమోడి గారిని బలపరచడంలో పోటీ పడుతున్నారు. అధికారం సంపాదించాలనే కాంక్ష తప్పా ఏ విలువలేని రాజకీయాలు రాష్ట్రంలో కొనసాగిస్తున్నారు. అందుకే ప్రజలు మేల్కోవాలి. మతోన్మాద రాజకీయాలతో అధికారం వెలగపెడుతున్న బిజేపికి బుద్దిచెప్పాలి. మతోన్మాదాన్ని వ్యతిరేకించకపోతే పుట్టగతులుండవని టిడిపి, వైసీపిని హెచ్చరించేలా ప్రజల్ని చైతన్య పరచాలి. లౌకిక విలువల కోసం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం కలిసివచ్చే అన్ని శక్తులను కలుపుకొని ఒక మహాఉద్యమాన్ని నిర్మించాల్సిన అవరం ఎంతో పెరిగింది.

**- ఎం.ఎ.గఫూర్**

ఆవాజ్ కమిటీ వ్యవస్థాపకులు

# 2025 వక్ఫ్ చట్ట సవరణ మైనారిటీల పై దాడి

**- హన్నన్ మొల్లా**

మాజీ పార్లమెంట్ సభ్యులు, సిపిఎం సీనియర్ నాయకులు

వక్ఫ్ అన్నది అరబిక్ పదం. మత పరమైన, దాతృత్వ పరమైన లక్ష్యాలతో ఏర్పడిన ఆస్తిని వక్ఫ్ గా పరిగణిస్తారు. ఇస్లాం మతాన్ని స్వీకరించిన ఒక యూదుడు ప్రవక్త మహమ్మద్‌కు కొంత భూమిని ఇవ్వజూపాడు. అప్పుడు ప్రవక్త అతడికి ఆ భూమిని అల్లా పేరు మీద వక్ఫ్‌గా దానం ఇవ్వమని సూచించాడు. ఈ వక్ఫ్ ఆస్తి ద్వారా వచ్చే సంపదను పేద వితంతువులకు, విద్యార్థులకు, మసీదులకు, మదరసాలకు, అనాధ శరణాలయాలకు వెచ్చించాలని సూచించాడు. ఆ తర్వాత అనేక దేశాలలో లక్షలాదిగా వక్ఫ్ ఆస్తులు ఏర్పడ్డాయి. ఒకసారి వక్ఫ్ ఆస్తిగా ఏర్పడ్డాక అది అల్లాకు చెందుతుంది. దానిని వెనక్కు తీసుకోడానికి గాని, వేరేవాళ్ళు స్వాధీనం చేసుకోడానికి గాని, ఇతరులకు అమ్మడానికి గాని వీలు లేదు.

దేశం మొత్తం మీద 8.7 లక్షల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని, వాటికి 9.4 లక్షల ఎకరాల భూమి ఉందని, భారతీయ రైల్వే తర్వాత అతి ఎక్కువ భూమి వక్ఫ్‌ల వద్దే ఉందని ప్రకటించారు. ఆ తర్వాత ఈ విస్తారమైన, విలువైన భూమిని ఏవిధంగా చేజిక్కించుకోవాలన్నది చర్చ జరిగింది. ఈ భూమిలో అధిక భాగం పట్టణ ప్రాంతాల్లో ఉంది. అందుచేత దాని విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. భూదాహంతో తహతహలాడుతున్న కార్పొరేట్ వ్యక్తుల కళ్ళు ఈ వక్ఫ్ భూముల మీద పడ్డాయి.

ఇందుకు ఒక ఉదాహరణ అంబానీది. ముంబైలో చట్ట విరుద్ధంగా చాలా విలువైన వక్ఫ్ భూమిని అంబానీ కొనుగోలు చేసి అక్కడ తన భార్య కోసం రు. 16,000 కోట్లు వెచ్చించి ఒక రాజ మహలు నిర్మించాడు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది. బహుశా అంబానీ ఈ కేసు ఓడిపోవచ్చు.

ఇటువంటి కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడడానికి, వాళ్ళు మరిన్ని వక్ఫ్ భూముల్ని చేజిక్కించుకోడానికి వీలుగా మోడీ ప్రభుత్వం ఆ వక్ఫ్ భూములమీద పెత్తనాన్ని తన చేతుల్లోకి తీసుకోడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో వక్ఫ్ సవరణ చట్టం, 2025 ను పరిశీలించాలి.

మోడీ ప్రభుత్వ హయాంలో మైనారిటీలు ఎడతెగని బాధలనుభవిస్తున్నారు. మూకదాడులు ఎక్కడ బడితే అక్కడ జరుగుతూనే వున్నాయి. ప్రాణాలు పోతున్నాయి. జీవనోపాధి హరించబడుతోంది. నిరుద్యోగం తాండవిస్తోంది. సిఎఎ వంటి చట్టాల

ద్వారా మైనారిటీల ప్రజాస్వామ్య హక్కులను ఒక పథకం ప్రకారం కాలరాస్తున్నారు. ముస్లింల ఆహారపుటలవాట్ల మీద దాడులు జరుగుతున్నాయి. ప్రార్థనా స్థలాల మీద తెగబడుతున్నారు. మతపరమైన స్థలాల చట్టాన్ని తిరగదోడుతున్నారు. ముస్లింల జీవితాలలోని అన్ని పార్శ్వాలలోకీ వివక్షత చొచ్చుకుపోతున్నది. "లవ్ జిహాద్", "భూ జిహాద్" వంటి పేర్లతో మత విద్వేష చీలికలను సృష్టిస్తున్నారు. ముస్లిం దుకాణాలనుండి కొనుగోలు చేయవద్దని, వారిని బహిష్కరించాలని చాలా పకడ్బందీగా ప్రచారాలు జరుగుతున్నాయి. బిజెపి – ఆరెస్సెస్ నాయకుల విద్వేషపూరిత ప్రసంగాలు నిత్యకృత్యం అయిపోయాయి. పార్లమెంటులో, రాష్ట్రాల అసెంబ్లీలో ముస్లింల ప్రాతినిధ్యాన్ని తగ్గించడానికి పనిగట్టుకుని ప్రయత్నిస్తున్నారు. హిజాబ్ పేరుతో ముస్లిం ఆడబిడ్డల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముస్లింలు ఈ దేశానికి చారిత్రికంగా అందించిన అభివృద్ధిని తుడిచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. సమాజంలో లౌకిక, హేతుబద్ధ భావాలను వ్యక్తం చేసేవారి గొంతుకలను నొక్కేస్తున్నారు.

ఇటువంటి నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ తేవడం వెనుక ఉద్దేశ్యం ముస్లిం మహిళలకు ప్రయోజనాలు కల్పించడం కోసమేనని ప్రకటిస్తోంది. ఇంతకన్నా మోసపూరితమైనది, అసంబద్ధమైనది ఇంకొకటుంటుందా? సుల్తానుల, మొగల్ చక్రవర్తుల కాలంలో భారతదేశంలో వక్ఫ్ మొదలైంది. ముస్లిం ప్రజల ప్రయోజనాల కోసం ఈ వక్ఫ్ ఆస్తులు ఇస్లామిక్ ఆచారాల ప్రకారం ఏర్పడ్డాయి. మదరసాల నిర్మాణాలను, నిర్వహణను వాటి ఆదాయాలతో చేపట్టారు. విద్యాసంస్థలు, స్మశానాలు, మసీదులు, ఆరోగ్య కేంద్రాలు వంటివి ఎన్నో నిర్మించారు. ముస్లిం మత సాంప్రదాయాలకు అనుగుణంగా ఈ వక్ఫ్ ఆస్తులను చాలా కాలంగా నిర్వహిస్తూ వచ్చారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం ఈ సాంప్రదాయాలను అన్నింటినీ ఒక చట్టరూపంలోకి తెచ్చి వక్ఫ్ చట్టం చేసింది.

వక్ఫ్ చట్టాన్ని 1959 లో, 1964లో, 1969లో, 1984లో సవరించారు. ఇవన్నీ చిన్న చిన్న మార్పుల కోసమే జరిగాయి. కొత్తగా తలెత్తుతున్న అవసరాలకు అనుగుణంగా, ఇస్లామిక్ పండితుల, ముస్లిం సంస్థల సలహాల మేరకు ఈ సవరణలు చేశారు. ఆ తర్వాత ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ ఈ చట్టాన్ని లోతుగా అధ్యయనం చేసింది. అనంతరం ఆ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు 1995 లో సమగ్రమైన వక్ఫ్ చట్టాన్ని చేశారు. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ వ్యవహారాలను నిర్వహించేందుకు, పర్యవేక్షించేందుకు వక్ఫ్ బోర్డులు ఏర్పడ్డాయి. ప్రతీ వక్ఫ్‌నూ ఒక ముతావాలి లేదా ఒక ముతావాలి కమిటీ నడుపుతాయి. ఈ కమిటీలో ఆస్తిని దానం చేసినవారు. ఇతర ముస్లిం సభ్యులు ఉంటారు. వారు ఇస్లాం చట్టాల, సాంప్రదాయాల ప్రకారం వక్ఫ్‌లను నిర్వహిస్తారు.

ఈ కార్యకలాపాలనన్నింటినీ పర్యవేక్షించడానికి, మార్గదర్శకత్వం నెరపడానికి ప్రతీ రాష్ట్రంలోనూ ఒక వక్ఫ్ బోర్డు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి ఈ బోర్డుకు ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా (సిఇవో) ఉంటారు. అన్ని వక్ఫ్‌లు రిజిస్టరు చేసుకుని వుండాలి. వాటి వార్షిక ఆదాయ వ్యయాల వివరాలను వక్ఫ్ బోర్డుకు ప్రతీ ఏడూ సమర్పించాలి. ఎక్కడైనా వివాదం తలెత్తితే దానిని వక్ఫ్ బోర్డు వక్ఫ్ చట్టాల ప్రకారం పరిష్కరించాలి. ఒకవేళ పరిష్కారం కాకుండా మిగిలిపోతే ఆ వివాదాన్ని కోర్టుకు నివేదిస్తారు.

వక్ఫ్ చట్టం అమలులో చాలా బలహీనతలు పొడచూపాయి. ఉదాహరణకు: 1995 చట్టం వక్ఫ్ నిబంధనలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత ఇచ్చింది. కాని చాలా రాష్ట్రాలు నేటికీ ఆ నిబంధనలను రూపొందించలేదు. కేంద్ర ప్రభుత్వం ఒక కేంద్ర వక్ఫ్ కమిషనర్‌ను నియమించాలని ఆ చట్టం ఆదేశించింది. కాని కేంద్ర ప్రభుత్వం ఆ ఆదేశాన్ని సైతం అమలు చేయడంలో విఫలమైంది. ప్రభుత్వాలవైపు నుండి తలెత్తిన పలు లోపాల కారణంగా అనేక సమస్యలు పుట్టుకొస్తున్నాయి.

వక్ఫ్‌ల నిర్వహణలో అవకతవకలు, అవినీతి వంటివి చోటు చేసుకుంటు న్నాయని, వక్ఫ్ ఆస్తులు కబ్జా అయిపోతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ తప్పులకు కేవలం ముస్లిం ప్రజానీకాన్ని, లేదా ఆ వక్ఫ్ సంస్థలను మాత్రమే నిందించడం సరైనదేనా? వ్యవస్థాగతంగా ఉన్న అనేక లొసుగుల వలన, పర్యవేక్షణా లోపాల వలన ఇవి ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడున్న చట్టాన్ని కట్టుదిట్టంగా, సమర్ధవంతంగా అమలు జరపడమే పరిష్కారం. ప్రభుత్వ నిర్వహణా లోపాలను సరిదిద్దుకోవడం మానేసి కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరించడానికి పూనుకుంది. అందుకు ఆ లోపాలనే సాకుగా చూపిస్తోంది. ఈ వైఖరి అంతిమంగా వక్ఫ్ లక్ష్యాలకు, దాని ప్రయోజనాలకు హానికరంగా తయారు కాగలదు.

1995 వక్ఫ్ చట్టానికి కేంద్ర ప్రభుత్వం ఏకంగా 40 కి పైగా సవరణలను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపింది. ఆ కమిటీ చాలా తొందరపాటుగా వ్యవహరించి తన సిఫార్సులను ఇచ్చింది. ప్రతిపక్షాలకు చెందిన కమిటీ మెంబర్ల అభిప్రాయాలను నమోదు చేయలేదు. అక్కడితో ఆగకుండా వారందరినీ కమిటీ నుండి బహిష్కరించారు. కమిటీలోని పాలక పార్టీ సభ్యులు మాత్రమే కూర్చుని ఆ సిఫార్సులను ఆమోదించారు. ఆ సిఫార్సులన్నీ మైనారిటీలకు వ్యతిరేకంగా ఉన్నవే. కమిటీ నివేదికను స్పీకర్ త్వరగా ఆమోదించాడు. వెంటనే ఆ బిల్లును లోక్‌సభలోను, రాజ్యసభలోను మెరుపు వేగంతో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా పడిపోయింది.

సవరించిన చట్టాన్ని వెంటనే అమలులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భారీ ఎత్తును వక్ఫ్ భూములు కబ్జాలకు గురౌతాయన్న ఆందోళనలు తలెత్తాయి. మైనారిటీలలో ఇది భయాన్ని, ఆందోళనను కలుగజేసింది. దాంతో వారు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో వేలాదిగా నిరసన ప్రదర్శనలకు దిగారు. అన్ని ప్రజాస్వామిక, ప్రతిపక్ష పార్టీలూ వారికి మద్దత్తు గా నిలిచాయి. వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలన్న వారి డిమాండ్‌ను పూర్తిగా సమర్ధించాయి.

ముందే వివరించినట్టు, 'వక్ఫ్' అనేది ఒక అరబిక్ పదం. దాని మూలాలు ఇస్లామిక్ సాంప్రదాయాలలో, పద్ధతులలో ఉన్నాయి. ఐతే ఇప్పుడు చట్టానికి చేసిన సవరణ వక్ఫ్ యొక్క మౌలిక భావననే మార్చేయడానికి పూనుకుంది. "ఐక్య యాజమాన్యం", "సాధికారత", "సామర్ధ్యం", "అభివృద్ధి" వంటి పదాలను జొప్పించింది. ఈ పదాల వెనుక గూఢంగా వేరే ప్రయోజనాలు దాగున్నాయని ఆందోళన కలుగుతోంది. వక్ఫ్ ఎల్లప్పుడూ ఇస్లామిక్ సూత్రాలనే అనుసరిస్తోంది. అటువంటప్పుడు "ఐక్య యాజమాన్యం" అన్న పదాన్ని జొప్పించడం ఎందుకు? ఎవరితో ఐక్యత? దానివలన మత స్వయంనిర్ణయాధికారానికి ఎటువంటి ముప్పు వాటిల్లనుంది? ముస్లిమేతరులను వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో భాగస్వాములుగా చేయడానికే ఈ పదాన్ని చేర్చారా? ఇటువంటి ఉమ్మడి ఆస్తుల నిర్వహణలో ఈ ప్రభుత్వం ఇంతవరకూ ప్రదర్శించిన నిర్వాకం ఎలా ఉంది?

వక్ఫ్ ఆస్తులు యావత్తు ముస్లిం ప్రజానీకానికీ ఉపయోగపడడం కోసం ఉన్నాయి. కాని చట్ట సవరణలో అనవసరంగా ముస్లింలలో చీలికలు తెచ్చే విధంగా బొహ్రా, బహన్ వంటి పదాలతో ముస్లింలను వర్గీకరించడం జరిగింది. వక్ఫ్ బోర్డులను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయి. కాని ఈ చట్ట సవరణ చేసేటప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పాత్రను పూర్తిగా విస్మరించింది. ఏకపక్షంగా వ్యవహరించింది. ఇది మన రాజ్యాంగపు ఫెడరల్ సూత్రాలకు పూర్తి విరుద్ధం. రాష్ట్రాల అధికారాలమీద ప్రత్యక్ష దాడి.

సవరించిన చట్టంలోని క్లాజు నెం. 4 అసలు చట్టంలోని వక్ఫ్ ప్రయోజనాన్నే వక్రీకరిస్తోంది.

"ఏ వ్యక్తి యొక్క స్థిర, చరాస్తులనైనా" అని అసలు చట్టంలో ఉన్నదానిని ఇప్పుడు "ముస్లిం మతాన్ని కనీసం గత ఐదేళ్ళుగా ఆచరిస్తున్న ఏ వ్యక్తి యొక్క స్థిర, చరాస్తులనైనా" అని మార్చారు. గతంలో ముస్లిమేతరులు కూడా మైనారిటీలకు మద్దత్తుగా వక్ఫ్‌లను ఏర్పరచడానికి సహకరించారు. ఇప్పుడు అలా సహకరించడానికి వీలు లేకుండా సవరణ చేశారు. కేవలం గత ఐదేళ్ళుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్న వారు మాత్రమే వక్ఫ్‌కు దానం చేయడానికి అర్హులౌతారు. ఇది కేవలం మైనారిటీలకు

మాత్రమే వ్యతిరేకంగా లేదు. ఏ వ్యక్తి కైనా వక్ఫ్‌కు దానం చేసే స్వేచ్ఛను ఇది కాలరాస్తోంది. 1995 చట్టంలో ఉన్న సమైక్యతా స్ఫూర్తిని దెబ్బ తీస్తోంది.

ఇంతవరకూ వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏ విచారణనైనా చేపట్టడానికి వక్ఫ్ బోర్డుకు అధికారం ఉండేది. ఇప్పుడు ఆ అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు బదలాయించారు. ఒక ముస్లిం-నిర్వహణ యాజమాన్య సంస్థ నుండి అధికారం ప్రభుత్వ అధికారులకు అప్పగించడం జరిగింది. ఇప్పుడు వక్ఫ్ రిజిస్ట్రేషన్ కూడా జిల్లా కలెక్టర్ సమక్షంలోనే జరగాలి. ఇంతవరకూ ఇస్లామిక్ సాంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నదానికి ఇది విరుద్ధం.

వక్ఫ్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములపై నిర్ణయాధికారం ఇప్పుడు జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. గతంలో వక్ఫ్ కమిషనర్‌ను వక్ఫ్ బోర్డు నియమించేది. ఆ వక్ఫ్ కమిషనర్‌కు ఉన్న అధికారాలను తొలగించి వాటిని కూడా ఇప్పుడు జిల్లా కలెక్టర్లకు కట్టబెట్టారు. ఇది వక్ఫ్ వ్యవస్థకు ఉన్న మతపరమైన హక్కులపై తీవ్ర దాడి.

గతంలో చట్టం వక్ఫ్ బోర్డులో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలని నిర్దేశించింది. ఇప్పుడు సవరించిన చట్టంలో ఇద్దరు మాత్రమే మహిళలు ఉండాలని చెప్తోంది. ఎక్కువ మంది మహిళలకు ప్రాతినిధ్యం ఉండే అవకాశాన్ని ఈ సవరణ నిరాకరిస్తోంది.

కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో అందరూ ముస్లిములే ఉండాలని ఇంతకు ముందున్న చట్టం చెప్పింది. కాని ఇప్పుడు చేసిన సవరణ ప్రకారం ఇద్దరు ముస్లిమేతరులను కౌన్సిల్‌లో సభ్యులుగా చేర్చవచ్చు. ఇది ఒక మత వ్యవస్థలో ఇతరులు చొరబడడం అవుతుంది. ముస్లిం సంస్థలలో మత వివాదాలను రేకెత్తించడానికి దారి తీస్తుంది. ఇక్కడ సహజంగానే ఈ ప్రభుత్వానికి ఒక సవాలు ఎదురౌతుంది. "ఈ ప్రభుత్వం హిందూ దేవాలయాల నిర్వహణ కోసం ముస్లిం సభ్యులను నియమించే ఆలోచననైనా చేయగలుగుతుందా?"

పాత చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డు వివాద పరిష్కారం కోసం ఏర్పరిచే ఏ ట్రిబ్యునల్‌లోనైనా సభ్యులుగా ఇస్లామిక్ చట్టంలో నిపుణులైన వారినే నియమించాలి. ఇప్పుడు ఆ షరతు ఏదీ లేదు. ఏ వ్యక్తినైనా, ఎటువంటి నైపుణ్యం లేకపోయినా, ఏ పరిజ్ఞానమూ లేకపోయినా ట్రిబ్యునల్‌కు సభ్యుడిగా నియమించవచ్చు. ముస్లిమేతరులను కూడా నియమించవచ్చు. ఇది ముస్లిం మత వ్యవహారాల్లో ఇతరులను చొప్పించి మత ఘర్షణలను రెచ్చగొట్టడానికి దారి తీస్తుంది.

గతంలో వక్ఫ్ బోర్డులో ఒక ముస్లిం పార్లమెంటు సభ్యుడు కాని అసెంబ్లీకి చెందిన ముస్లిం సభ్యుడు కాని ఉండాలని చట్టంలో ఉంది. కాని ఇప్పుడు దానిని

తొలగించారు. దాని వలన బోర్డులో ముస్లిమేతరుల ఆధిపత్యం పెరిగే ప్రమాదం ఉంది. ఈ ప్రభుత్వం హిందూ దేవాలయాల ట్రస్టుల్లో ముస్లింలను నియమించడానికి సిద్ధంగా ఉందా?

గతంలో వక్ఫ్ ట్రిబ్యునల్స్‌ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండేది. ఇప్పుడు దానిని తొలగించి నేరుగా జిల్లా కలెక్టర్లకు కట్టబెట్టారు. ఇక రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ ఎక్కడుంటుంది?

గతంలో బ్రిటిష్ పాలనాకాలంలో జిల్లా కలెక్టర్లకు కొన్ని అధికారాలను ఇచ్చారు. కాని ఆ కలెక్టర్లకు ఉన్న విపరీతమైన పనుల భారం వలన, బహు బాధ్యతల వలన వక్ఫ్‌కు సంబంధించిన పనులను వారు పట్టించుకోడంలో విఫలమయ్యారు. అందుచేత ఆ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ట్రిబ్యునళ్ళను ఏర్పాటు చేశారు. ఇప్పుడు చట్టానికి చేసిన సవరణలు మళ్ళీ పరిస్థితిని మొదటికే తెస్తున్నాయి. ముస్లిం వక్ఫ్ బోర్డు, ముస్లిం సభ్యులతో కూడిన ట్రిబ్యునళ్ళు చేస్తున్న పనులను జిల్లా కలెక్టర్లకు. ముస్లిమేతర అధికారులకు అప్పజెప్పడం అంటే వక్ఫ్ ఆస్తులమీద ఇస్లామిక్ యాజమాన్యం స్థానంలో ప్రభుత్వ ప్రత్యక్ష యాజమాన్యాన్ని తీసుకురావడమే ఔతుంది.

గతంలో వక్ఫ్‌కు చెందిన అకౌంట్లను ఆడిట్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండేది. ఇప్పుడు సవరించిన చట్టం ప్రకారం ఆ అధికారాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం తన చేతిలోకి తీసుకుంది.

ఈ సవరణలన్నీ చూస్తే వక్ఫ్‌లను మెరుగ్గా నిర్వహించే లక్ష్యంతో కాకుండా, ఒక మత విద్వేషపు మానసిక స్థితి నుండి కేంద్ర ప్రభుత్వం వీటిని తెచ్చిందని స్పష్టం ఔతోంది. రాజ్యాంగంలో 25, 26 అధికరణలు మైనారిటీలకు గ్యారంటీ చేసిన ప్రాథమిక హక్కులకు ఈ సవరణ భంగం కలిగిస్తోంది. తమ మత సంస్థలను తాముగా నిర్వహించుకునే హక్కును ఒక కుట్ర ప్రకారం వారికి నిరాకరించడం జరుగుతోంది. ఈ సవరణలను సమర్థించుకోడానికి ప్రభుత్వం చేస్తున్న వాదనల్లో వాస్తవమూ లేదు, అవి సరైనవీ కావు. కేవలం ఒక మతవిద్వేష ఎజండాను అమలు చేసే లక్ష్యమే కనిపిస్తోంది.

వక్ఫ్ యొక్క అసలైన స్ఫూర్తిని దెబ్బ తీసి దానిని ఒక ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే సంస్థగా, ముస్లిమేతరుల పెత్తనంలో నడిచే వ్యవస్థగా మార్చివేసే ప్రమాదం కనిపిస్తోంది. సహజంగానే ఈ సవరణలు మైనారిటీలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. “హిందూ రాజ్యం” స్థాపించాలనే దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు తీవ్ర అస్థిరతకు కారణమౌతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ చట్ట సవరణలను ఉపసంహరించడమే పరిష్కారం.

*